# రఘురామ కేసులో ఆయన పాత్రపైనా అనుమానం

తెలంగాణవీణ,ఏపీ



మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై హత్యాయత్నం కేసు దర్యాప్తులో మరో అడుగు ముందుకు పడింది. అప్పట్లో సీఐడీ డీఐజీగా పనిచేసిన సునీల్ నాయక్‌ను విచారించేందుకు దర్యాప్తు అధికారి, ప్రకాశం ఎస్పీ దామోదర్ రెండ్రోజుల క్రితం నోటీసులు పంపారు. రఘురామరాజును హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తీసుకొచ్చినప్పుడు సునీల్ నాయక్ కూడా వచ్చినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనలో ఆయన పాత్రపైనా విచారించాలని నిర్ణయించిన అధికారులు ఫ్యాక్స్, వాట్సాప్ ద్వారా నోటీసులు పంపారు. బీహార్ క్యాడర్‌కు చెందిన సునీల్ నాయక్‌ను వైసీపీ ప్రభుత్వం డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి సీఐడీ డీఐజీగా పోస్టింగ్ ఇచ్చింది. ఏపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే సునీల్ నాయక్ తిరిగి బీహార్ వెళ్లిపోయారు. ప్రస్తుతం అక్కడాయన అగ్నిమాపకశాఖ విభాగంలో డీఐజీగా పనిచేస్తున్నారు.

# కేరళలో వరుస హత్యలు..

తెలంగాణవీణ,కేరళ



కేరళలో ప్రియురాలితో సహా నలుగురు కుటుంబ సభ్యులను దారుణంగా హత్య చేసిన ఉదంతం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ కేసులో దిగ్భ్రాంతికర విషయాలను తాజాగా పోలీసులు బయటపెట్టారు. రూ.65 లక్షల అప్పు తట్టుకోలేక కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిందితుడు అఫాన్ భావించినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు అంగీకరించకపోవడంతో వారిని హత్య చేశాడని పేర్కొన్నారు. తాను చనిపోతే ప్రియురాలు ఒంటరి అవుతుందని భావించి ఆమెను కూడా చంపినట్లు నిందితుడు అఫాన్ విచారణలో వెల్లడించాడని చెప్పారు. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెంజరమూడుకు చెందిన అఫాన్ (23) కుటుంబానికి సుమారు 65 లక్షల అప్పు ఉంది. దీనిని తీర్చాలంటూ 14 మంది ప్రైవేటు వ్యక్తులు అతనిపై ఒత్తిడి పెంచారు. అఫాన్ తండ్రి సౌదీలో ఉండేవాడు. స్థానికంగా అప్పుల వాళ్ల ఒత్తిడిని అఫాన్ తట్టుకోలేకపోయాడు. ఈ విషయంలో బాబాయ్, పిన్ని, నానమ్మ ఏ సహాయం చేయలేదు. దాంతో వారి మీద కోపం పెంచుకున్నాడు. అప్పుల వారి ఒత్తిడి నుంచి బయటపడాలంటే ఆత్మహత్యే శరణ్యం అని నిర్ణయించుకున్న అఫాన్.. తల్లి, సోదరుడికి తెలియజేయగా, అందుకు తల్లి నిరాకరించింది. దీంతో హత్యలకు ప్లాన్ చేశాడు. తల్లి, సోదరుడిని హత్య చేసిన తర్వాత తాను ఆత్మహత్య చేసుకోవాలని అఫాన్ భావించాడు.ఈ క్రమంలో తొలుత తల్లిపై దాడి చేశాడు. ఆ తర్వాత నానమ్మ దగ్గరకు వెళ్లి ఆమె బంగారు గొలుసు దొంగతనం చేసి, అనంతరం ఆమెను చంపేశాడు. అక్కడి నుంచి బాబాయి, పిన్ని ఇంటికి వెళ్లి వారిద్దరినీ హతమార్చాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి 13 ఏళ్ల తమ్ముడిని, ప్రేయసి ఫర్సానాను మట్టుబెట్టాడు. తాను చనిపోతే ప్రియురాలు అయిపోతుందనే భావనతోనే ఆమెను చంపానని అఫాన్ పోలీసులకు తెలిపాడు. అయితే ఈ దాడిలో అఫాన్ తల్లి మరణించలేదు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయితే ఈ ఘటనపై ఆమె తన కొడుకుపై ఫిర్యాదు చేయకపోగా, తనపై కుమారుడు దాడి చేయలేదని, తానే మంచంపై నుంచి పడిపోయానని పోలీసులకు తెలిపింది. విషయం తెలుసుకున్న నుంచి అఫాన్ తండ్రి రహీమ్ సౌదీ నుంచి తిరిగి వచ్చాడు. తన కుటుంబానికి ఈ స్థాయిలో అప్పులు ఉన్న విషయం తనకు తెలియదని పోలీసులకు తెలిపారు. మరోవైపు నిందితుడి మానసిక పరిస్థితిని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

